క్లుప్తంగా

విధులకు హాజరు కాని టీచర్‌పై హెచ్‌ఎం ఫిర్యాదు

పుత్తూరు : స్థానిక గేట్‌పుత్తూరు జడ్పీ తమిళ ఉన్నత పాఠశాలలో తమిళ ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న బేబీకస్తూరి గత జూన్ 25వ తేదీ నుంచి విధులకు హాజరు కావడం లేదని హెచ్‌ఎం కృష్ణవేణి పేర్కొన్నారు. ఎలాంటి ముందస్తు అనుమతి తీసుకోకుండా నెలల తరబడి విధులకు హాజరు కాకపోవడంతో జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తమిళ సబ్జెక్టుకు సంబంధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆ ఉపాధ్యాయురాలిపై చర్యలు తీసుకొని, మరొకరిని నియమించాలని కోరినట్లు తెలిపారు.

విద్యార్థుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో

నగరి : విద్యార్థుల వివరాలు ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని ఎంఈవో శ్రీదేవి పేర్కొన్నారు. బుధవారం కీళపట్టు, కాకవేడు ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి వివరాలు, అతని పఠనా సామర్థ్యం ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఐడీ క్రియేట్ చేయాలన్నారు. ఆటల్లోనూ విద్యార్థులకు ప్రోత్సాహం అందించాలన్నారు. ఈసందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలన చేశారు.

వేరుశనగ విత్తనాల పంపిణీ

నింద్ర : మండలంలోని రైతులకు రబీ సీజన్‌లో వేరుశనగ పంట వేసే రైతులకు రాయితీపై వేరుశనగ విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి తులసీరాం తెలిపారు. బుధవారం మండలంలోని అగరం, నింద్ర, ఆరూరు, ఇరుగువాయి గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో విత్తన కాయలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు విత్తన శుద్ధి పాటించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు దూడ మృతి



శ్రీరంగరాజపురం : పిడుగుపాటుకు దూడ మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని పెద్దతయ్యూరులో బుధవారం చోటు చేసుకుంది. బాధితురాలు అల్లెమ్మ కథనం మేరకు వివరాలు... మేతకోసం పాడి ఆవుతో పాటు దూడను సమీపంలోని వ్యవసాయ పొలానికి తీసుకెళ్లింది. దీంతో ఆకస్మాత్తుగా ఉరుములు మెరుపులతో కూడిన వర్షం రావడంతో పశువులను పొలంలో వదలి ఆమె ఇంటికి చేరుకోవడంతో అదే సమయంలో పిడుగు పడి దూడ మృతి చెందినట్లు తెలిపారు. తన కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు.

పట్టుదల వీరులు.. పతకాల ధీరులు



- రాష్ట్ర స్థాయిలో రాణిస్తున్న విద్యార్థులు
- నేడు బాలల దినోత్సవం

ముద్దొచ్చే మాటలు.. మురిపించే చేతులు..అబ్బురపరిచే పనులు.. ప్రోత్సహిస్తే నేటి బాలలు.. రేపటి మేధావులు..కుటుంబ సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు, చిన్నారుల్లోని ప్రతిభను ప్రోత్సహిస్తే పట్టుదలతో ఎంతటి పని అయినా సాధిస్తారు. తద్వారా జీవితాల్లో శాశ్వతమైన మార్పు తీసుకొస్తారు. ఆటలు, చదువే కాదు.. అన్ని రంగాల్లో రాణిస్తూ అందరి చేత ఈ విద్యార్థులు శభాష్ అనిపించుకుంటూ మిగిలిన వారికి ఆదర్శంగా నిలుస్తునారు. నేడు బాలల దినోత్సవం సందర్భంగా వీరిపై ప్రత్యేక కథనం. – పుత్తూరు/నగరి/నింద్ర



బాల మేధావులు


జర్మ్స్ కిల్లర్ పరికరంతో విద్యార్థినులు

పుత్తూరు మండలం తడుకు ఆర్‌ఎస్ విద్యార్థినులు హేమశ్రీ, గీతిక, భావన, గౌతమి, జాహ్నవి రూపొందించిన మినీ మల్టీ పర్పస్ జర్మ్స్ కిల్లర్ అనే పరికరాన్ని రాష్ట్ర స్థాయి యునిసెఫ్ మెగా ఫినాలేలో గతేడాది ప్రదర్శించారు. వీరి ప్రదర్శన తృతీయ స్థానంలో నిలిచి జ్ఞాపికతో పాటు రూ.25 వేల నగదు బహుమతిని గెలుచుకొని అందరి మనసులు గెలుచుకున్నారు. జీవశాస్త్ర ఉపాధ్యాయుడు భానుప్రసాద్ ఆధ్వర్యంలో ఈ పరికరాన్ని రూపొందించారు. మార్కెట్‌లో అందరికీ అందుబాటులో ఉండే అయిదు అంగుళాల పీవీసీ పైపు, ఎల్‌ఈడీ లైట్లు, గాజు పలకలు, అడాప్టర్, ఎగ్జాస్ట్ ఫ్యాన్, మస్కిటో బ్యాట్‌ను వినియోగించి ఈ పరికరాన్ని రూపొందించారు. దీని ద్వారా ఆస్పత్రుల్లోని ఐసీయూ, ఎమర్జెన్సీ వార్డుల్లో ఒక రోగి నుంచి మరో రోగికి అంటు వ్యాధులు ప్రబలకుండా నియంత్రించవచ్చు. ఇళ్లలోని ఏసీ రూమ్స్‌లోనూ, టాయిలెట్లు, అంబులెన్స్‌లో ఈ సాధనాన్ని వినియోగించవచ్చు.

మినీ ఫాస్ట్ కంపోస్టర్‌కు నగదు బహుమతి


మినీ ఫాస్ట్ కంపోస్టర్‌తో విద్యార్థినులు హేమశ్రీ, గీతిక

తడుకు ఆర్‌ఎస్‌కు చెందిన విద్యార్థినులు హేమశ్రీ, గీతికలు మినీ ఫాస్ట్ కంపోస్టర్‌ను రూపొందించారు. జీవశాస్త్ర ఉపాధ్యాయుడు భానుప్రసాద్ మార్గదర్శకత్వంలో ఈ సాధనాన్ని రూపొందించారు. ఈ పరికరం పర్యావరణ అనుకూల సాంకేతికతతో పని చేస్తుంది. ఇది వంటగది వ్యర్థాలను పది రోజుల వ్యవధిలో పోషకాలు అధికంగా ఉండే సేంద్రియ ఎరువును తయారు చేస్తుంది. తద్వారా త్వరితగతిన కంపోస్ట్‌ను తయారు చేయవచ్చు. ఏడు అంగుళాల వ్యాసం కలిగిన ప్లాస్టిక్ పైపు, ఏడు అంగుళాల వ్యాసం కలిగిన స్టీల్ డస్ట్ బిన్, ఒక డీసీ ఇండక్షన్ హీటర్ కాయిల్, సోలార్ ప్యానెల్ బోర్డు సహాయంతో ఈ పరికరాన్ని రూపొందించారు. ఇందులో వంటగది వ్యర్థాలతో కనీసం ఏడు రోజుల్లో సేంద్రియ కంపోస్ట్ తయారవుతుంది. అగస్త్యా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వారు నిర్వహించిన సైన్స్ మేళాలో ఈ పరికరాన్ని ప్రదర్శించడం ద్వారా ప్రథమ బహుమతితో పాటు నగదు రివార్డును విద్యార్థినులు అందుకొన్నారు.

కబడ్డీలో సత్తా..


జాన్ పీటర్

నింద్ర : జిల్లా ఉన్నత పాఠశాలలో చదువుతున్న జాన్ పీటర్ జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో సత్తా చాటాడు. అదే విధంగా రాష్ట్ర స్థాయిలో విజయవాడ, ఏలూరు, కాకినాడలో వివిధ పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటి జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. ఈనెల 16 నుంచి మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయిలో పోటీల్లో ఇక సత్తా చాటనున్నాడు. చదువుల్లోనూ చురుగ్గా ఉంటూ క్రీడల్లో సత్తా చాటుతున్న పీటర్ ప్రతిభపై ఉపాధ్యాయులు ప్రశంసిస్తున్నారు.


చదరంగంలో దిట్ట


చెస్ ఆడుతున్న నవ్యశ్రీ

నగరి : మండలంలోని ముడిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న నవ్యశ్రీకి చిన్నప్పటి నుంచి చదరంగం అంటే ఇష్టం . అందుబాటులో ఉన్న అవకాశాలను వినియోగించుకుంటూ ఉపాధ్యాయుల తర్ఫీదుతో స్కూల్ గేమ్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి పోటీల్లో అర్హత సాధించింది. జిల్లా స్థాయిలో ఇటీవల నిర్వహించిన పోటీల్లో అండర్-17 విభాగంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులతో కలిసి పోటీ పడి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయింది. జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి అంతర్జాతీయ స్థాయికి వెళ్లాలన్న తపనతో ప్రతి రోజూ సాధన చేస్తూ అనుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు కృషి చేస్తోంది. చదరంగం మాస్టర్ ఆనంద మోహన్ తర్ఫీదు ఇస్తున్నారు. తల్లిదండ్రులు సహకారం అందిస్తున్నారు. వచ్చే ఏడాది జాతీయ స్థాయి పోటీల్లో విజయం సాధించాలనే పట్టుదలతో ఉంది.

చిత్రలేఖనంలో 'తనూజ' ప్రావీణ్యం

విజయపురం మండలం శ్రీహరిపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న తనూజ చిన్ననాటి నుంచే విద్యపై అంకితభావం కలిగి మండలం, జిల్లా స్థాయిలో జరిగే అన్ని రకాల పోటీల్లో పాల్గొంటూ తోటి విద్యార్థుల్లో స్ఫూర్తిగా నిలుస్తోంది. కేంద్ర ప్రభుత్వం 2024లో నిర్వహించిన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ పోటీల్లో ప్రతిభ కనబరిచి ఉన్నత విద్య చదువుకోడానికి రూ.60,000 ఉపకార వేతనం సాధించింది. సెప్టెంబర్ 2024 మండలం, జిల్లా స్థాయిలో జరిగిన స్వర్ణంధ్రాప్రదేశ్ సాధనలో విద్యార్థుల పాత్ర అను అంశం పై నిర్వహించిన వివిధ రకాల పోటీల్లో పాల్గొని విజయం సాధించింది. నెహ్రూ యువజనకేంద్రం, నెహ్రూ యువ జన సంక్షేమ సంఘం సంయుక్తంగా నిర్వహించిన జిల్లా స్థాయి చిత్రలేఖన పోటీల్లో ప్రతిభ కనబరచి ట్రోఫీ కైవసం చేసుకుంది. జాతీయ నాయకుల చిత్ర పటాలు గీయడంలో నేర్పరి అయిన తనూజ టీచింగ్ లర్నింగ్ మెటీరియల్ తయారు చేసి తరగతి గదులలో ప్రదర్శన చేస్తూ ఉపాధ్యాయుల ప్రశంసలు అందుకుంటోంది.


ట్రోఫీతో తనూజ, తనూజ గీసిన జాతీయ నాయకుల చిత్రాలు

గోడ రాతల తొలగింపు


గోడలపై పెయింటింగ్ వేస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

శ్రీరంగరాజపురం : సాక్షి దినపత్రికలో వి.వి.పురం పంచాయతీలోని ప్రభుత్వ రైతు సేవా కేంద్రం గోడలపై టీడీపీ, జనసేనకు చెందిన కొంత మంది ఆకతాయిలు పార్టీ పేర్లను గోడలపై రాశారు. దీంతో సాక్షి దినపత్రికలో బుధవారం 'ఆకతాయి చేష్టలపై ఆగ్రహం' అను కథనం ప్రచురితం అయింది. దీనిపై ఎంపీడీఓ మోహన్‌మురళి స్పందించారు. వెంటనే గోడలపై రాసిన రాతలను తొలగించి పెయింటింగ్ వేయించారు. ఎవరైనా ప్రభుత్వ భవనాలపై పార్టీ గుర్తులు, జెండాలు, ఒక పార్టీకి అనుకూలంగా రాతలు రాసిన ,లేక వ్యక్తిగతంగా దూషించే రాతలు రాసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ భవనాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించిన ఎంపీడీఓ మోహన్ మురళిని స్థానికులు అభినందించారు.

భక్తిశ్రద్ధలతో ప్రదోష పూజలు

వెదురుకుప్పం : మండలంలోని డీఆర్‌ఎస్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరిపై వెలసిన జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం ప్రదోష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివుడికి నందీశ్వరునికి ఏకకాలంలో అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. అంతకు ముందు సుప్రభాత సేవతో స్వామి వారిని మేల్కొలిపి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో స్వామివారిని సుందరంగా ముస్తాబు చేసి పూజలు చేశారు. సాయంత్రం నందీశ్వరునికి పాలు, పెరుగు, కుంకుమ, నారీకేళంతో అభిషేకం చేశారు. ఈ సందర్భంగా చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అయ్యప్ప భకక్తులు విశేష సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

నూతన చెరకు రకాలతో అధిక దిగుబడులు


చెరకు సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న కృష్ణన్

పాలసముద్రం : మండల పరిధిలోని రైతులు నూతన చెరకు రకాలు సాగు చేస్తే అధిక దిగుబడులు పొందవచ్చని డ్రేస్ సలహాదారు కృష్ణన్ తెలిపారు. బుధవారం రాచపాల్యంలో ఎస్ఎన్‌జే షుగర్ నెలవాయి సంస్థ వారు రైతులకు చెరకు సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. చెరకు కొత్త రకాలైన సీఓఎల్ ఎల్ఓ 15, సీఓ 18009, సీఓ 86032, టీ7 2016 చెరకు విత్తనాలను 4–5 అడుగుల దూరంలో నాటాలన్నారు. రైతులకు సంస్థ ద్వారా ఎకరాకు రూ.10 వేలు, సాధారణ పద్ధతిలో సాగు చేస్తే ఎకరాకు రూ. 5 వేలు రాయితీ ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ చిరంజీవి, క్షేత్రస్థాయి అధికారులు వెంకటేష్, కేశవులు, సతీష్, రైతులు రామస్వామిరాజు, నాగభూషణ నాయుడు, చిట్టిబాబు, సుదర్శన్, మోహన రాజు, స్వామిరాజు పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

కార్వేటినగరం : విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని డీఎం పురం హెచ్‌ఎం కేశవులు పేర్కొన్నారు. బాలల దినోత్సవం కార్యక్రమాన్ని పురస్కరించుకొని పాఠశాలలో విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుకే పరిమితం కాకుండా క్రీడలపై ఆసక్తి పెంచుకొని జాతీయ స్థాయిలో ప్రతిభ చాటాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పీడీ తిరుమలరాజు కబడ్డీ, క్రికెట్ , త్రోబాల్, సాఫ్ట్‌బాల్, హ్యాండ్‌బాల్, పరుగు పందెం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ త్యాగరాజు చేతుల మీదుగా అవార్డులను అందించారు.

సిద్ధవైద్యంతో దీర్ఘకాలిక వ్యాధులు దూరం


రోగులకు సూచనలిస్తున్న వైద్యులు

వడమాలపేట (విజయపురం) : సిద్ధ వైద్యంతో దీర్ఘకాలిక వ్యాధులైన షుగర్, బీపీ వ్యాధులను నయం చేసుకోవచ్చునని వడమాలపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు చక్రపాణి తెలిపారు. బుధవారం ప్రపంచ షుగర్ వ్యాధి దినం సందర్భంగా మండలంలోని టీసీ అగ్రహారంలో కేంద్రియ సిద్ధ పరిశోధనా మండలి తిరుపతి వారి సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిద్ధ వైద్యం క్రమం తప్పకుండా పాటించి బీపీ, షుగర్, నరాల బలహీనత, కీళ్ల నొప్పులు, నయం చేసుకోవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు శ్యామరాజు, అరుణాచలం, భాను, ప్రేమకుమార్, వెంకటముని, సీహెచ్ఓ పురుషోత్తం రెడ్డి, సూపర్ వైజర్ చంద్రమోహన్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మినీ అంగన్‌వాడీలను ప్రధాన కేంద్రాలుగా మార్చాలి


సీడీపీఓ పద్మ సునందకు వినతి పత్రాన్ని అందిస్తున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి గంగరాజు

కార్వేటినగరం : మినీ అంగన్‌వాడీలను ప్రధాన కేంద్రాలుగా మార్చాలని రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు 16న నిర్వహించే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గంగరాజు పేర్కొన్నారు. బుధవారం ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీఓ పద్మసునందకు అంగన్‌వాడీ కార్యకర్తలతో కలసి వినతిని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు 42 రోజుల పాటు అంగన్‌వాడీలు చేసిన సమ్మె చేసిన సందర్భంగా అధికారంలోకి వస్తే మినీ అంగన్‌వాడీ సెంటర్లను ప్రధాన అంగన్‌వాడీలుగా మారుస్తామని హామీలిచ్చారని ఆ హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాన కేంద్రాల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు మినీ వర్కర్లకు పదోన్నతులు కల్పించాలని కోరారు. మినీ అంగన్‌వాడీ వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం 16న జిల్లా కలెక్టరేట్‌లో జరిగే ధర్నాను కలసి కట్టుగా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధ్యక్ష , కార్యదర్శులు విజయ, మమత, పాల్గొన్నారు.

రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలి


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ డిల్లీ ప్రసాద్

పాలసముద్రం : పంటల సాగులో రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలని ఏఓ డిల్లీ ప్రసాద్ తెలిపారు. బుధవారం నరసింహాపురంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులతో ఏఓ మాట్లాడుతూ.. రసాయనిక ఎరువుల మోతాదును తగ్గించి సేంద్రియ ఎరువులను వాడాలన్నారు. అధికంగా రసాయనిక ఎరువుల వాడకంతో భూసారం తగ్గిపోతుందన్నారు. ఎక్కువగా రసాయనిక ఎరువులను వాడితే సారవంతమైన భూములు 15 ఏళ్లకు చౌడు భూములుగా మిగిలిపోతాయన్నారు. పచ్చిరొట్ట , పశువుల పేడతో భూములు సారవంతమవుతాయన్నారు. ముఖ్యంగా రైతులు భూసార పరీక్షల ఆధారంగా పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని తెలిపారు.

కళ తప్పిన పల్లె పండుగ

కూటమి ప్రభుత్వం పల్లెల్లో అభివృద్ధి పనులకు అంకురార్పణ అంటూ పల్లె పండుగ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగా గత అక్టోబర్ నెలలో 14 నుంచి 20 వరకు అన్ని పంచాయతీల్లో వారోత్సవాలను ఘనంగా నిర్వహించింది. సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు భూమి పూజలంటూ కూటమి నాయకులు హడావుడి చేశారు. అయితే పనుల విషయానికొస్తే ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా తయారైంది. నాయకుల ఆర్భాటమే కానీ పనుల్లో కదలిక లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- పుత్తూరులో రూ.2.03 కోట్లతో 69 పనులు
- ప్రారంభించింది కేవలం 6 మాత్రమే!
- శంకుస్థాపనలోనే ఆగిన పనులు


కనమిట్టలో సీసీ కోసం భూమి పూజ చేసిన రోడ్డు ఇదే

పుత్తూరు : పల్లె రోడ్ల మీద ప్రయాణం ప్రాణాంతకంగా మారింది. తుపానుల ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు గ్రామీణ రోడ్లు ఛిద్రమవుతున్నాయి. ఈ రోడ్లలో నడక అటుంచి, బైక్‌లు, ఆటోల వంటి వాహనాలపై ప్రయాణం సైతం ప్రమాదకరంగా మారింది. దీంతో గ్రామీణుల రాకపోకల అవస్థలు వర్ణనాతీతం. పుత్తూరు మండలంలోని 14 పంచాయతీల్లోని పలు గ్రామాలకు చెందిన రోడ్లు బురదమయంగా దర్శనమిస్తున్నాయి. అలాగే గ్రామాల్లో సరైన డ్రైనేజీలు లేక పల్లె ప్రజలు మురుగు కూపాల్లోనే మగ్గుతున్నారు. రోగాల బారిన పడి, ఆసుపత్రుల పాలవుతున్నారు. కొందరు విష జ్వరాలు సోకి ప్రాణాలు విడుస్తున్నారు. అయినా పాలకులు మౌలిక సదుపాయాలు సమకూర్చడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు.


అధ్వానంగా ఆనంబట్టు రోడ్డు, నేసనూరులో దెబ్బతిన్న డ్రైనేజీ

భూమి పూజలకే పరిమితమైన పనులు

పల్లెపండుగ పేరిట సీసీ రోడ్లకు భూమి పూజలు చేసి ప్రజాప్రతినిదులు, బోర్డు డైరెక్టర్లు హడావుడి చేశారు. పనులు వేగవంతం చేయడంలో మాత్రం వెనుకబడ్డారు. గ్రామీణ ఉపాధి పథకం కింద గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన పేరిట పుత్తూరు మండలంలో రూ.2.03 కోట్లతో 96 పనులు చేపడుతున్నట్లు ప్రకటించారు. ఇందులో 1.06 కోట్లతో 2,650 మీటర్ల మేర 36 సీసీ రోడ్లు, రూ.97 లక్షలతో 3,435 మీటర్ల మేర 33 సీసీ డ్రైనేజీలు నిర్మిస్తున్నట్లు ప్రకటించారు. అయితే ఇప్పటి వరకు ఒక్క సీసీ రోడ్లలో కేవలం ఆరు పనులకు మాత్రమే భూమి పూజ చేశారు. అవికూడా కేవలం మట్టి పనుల వద్దే ఆగిపోయాయి. ఇక సీసీ డ్రైనేజీ పనుల ఊసే లేదు.

నెల గడిచినా పనులు ప్రారంభించలేదు



పరమేశ్వరమంగళం పంచాయతీలోని ఎన్టీఆర్ కాలనీ ఏర్పడి 30 ఏళ్ల గడిచింది. అయినా మౌలిక సదుపాయాలు లేక అవస్థలు పడుతున్నాం. కాలనీలో సీసీ రోడ్డు వేస్తామంటూ ఇద్దరు అధికారులు వచ్చి కొలతలు తీసుకెళ్లారు. నెల గడిచినా పనులు ప్రారంభించ లేదు.

– ఆర్.మారిముత్తు, ఎన్టీఆర్ కాలనీ, పుత్తూరు

బురదమయంగా రహదారి



తొరూరు పంచాయతీ పరిధిలోని ఆనంబట్టు ఏఎడబ్ల్యూ వరకు సీసీ రోడ్డు వేయాలి. ప్రస్తుతం ఉన్న రోడ్డు చిన్నపాటి వర్షానికి బురదమయంగా మారిపోతున్నాయి. నడవడానికి కూడా వీలు పడదు. గ్రామంలో డ్రైనేజీ ఏర్పాటు చేయాలి. అధికారులు మాగ్రామంలో మౌలిక వసతులు కల్పించాలి.

– సి.వెంకటయ్య , ఆనంబట్టు ఏఎడబ్ల్యూ, పుత్తూరు

ఆందోళనలు చేసినా పట్టించుకోలేదు



తొరూరూ పంచాయతీ పరిధిలోని ఆనంబట్టు గ్రామానికి తారు రోడ్డు వేయాలని ఇది వరకే చిత్తూరు కలెక్టరేట్ వద్ద ఆందోళనలు చేశాం. అయినా నేటికీ మా గ్రామానికి రోడ్డును బాగు చేయలేదు. పైడిపల్లి నుంచి ఆనంబట్టు వరకు రోడ్డు వేయాలి. పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా మా రోడ్డును బాగు చేయండి.

– రమేష్ , ఆనంబట్టు , పుత్తూరు